క్లుప్తంగా

కౌలుకు ఆలయ భూములు

బి.కొత్తకోట: స్థానిక చౌళేశ్వర, చెన్నకేశవ స్వామి ఆలయాలకు చెందిన భూములను రైతులకు కౌలుకు ఇవ్వనున్నట్టు దేవదాయశాఖ ఈఓ ఎ.మునిరాజ ఆదివారం తెలిపారు. దీనికోసం ఈనెల 23న వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రూ.3వేలు డిపాజిట్టు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. చెన్నకేశవ ఆలయానికి చెందిన సుమారు 87 ఎకరాలకుపైబడిన భూములు, చౌళేశ్వర ఆలయానికి చెందిన 8.50 ఎకరాలును వేలంలో హెచ్చుపాటదారునికి మూడేళ్ల వ్యవసాయం చేసుకునేందుకు కౌలుకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

నేడు ఆలయాల హుండీ ఆదాయం లెక్కింపు

మదనపల్లె సిటీ: దేవదాయశాఖ పరిధిలోని ఆలయాలోని హుండీ ఆదాయం సోమవారం లెక్కించనున్నట్లు ఈఓ రమణ తెలిపారు. మదనపల్లె పట్టణం దేవళంవీధిలోని శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం, బెంగుళూరురోడ్డులోని యోగభోగేశ్వరస్వామి, దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయం, చిత్తూరు రోడ్డులోని కనుమలో గంగమ్మ ఆలయాల్లో హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నట్లు తెలిపారు.

మండల సచివాలయాల కన్వీనర్‌గా రామమోహన్‌రెడ్డి



నిమ్మనపల్లె: మండల సచివాలయాల కన్వీనర్‌గా రెడ్డివారిపల్లెకు చెందిన సి.రామమోహన్ రెడ్డి నియమితులయ్యారు. జగనన్న సచివాలయ రాష్ట్ర కోఆర్డినేటర్ శివశంకర్‌రెడ్డి నియామక సమాచారం పంపినట్లు రామమోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి చేసి, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు తెలియజేస్తానన్నారు.

విద్యార్థులకు రాగి జావ

పెద్దతిప్పసముద్రం: సర్కార్ స్కూళ్ల విద్యార్థుల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పీటీఎం హైస్కూల్ ఉపాధ్యాయుడు లక్ష్మినారాయణ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జగనన్న గోరు ముద్దలో భాగంగా ప్రభుత్వ స్కూళ్లలో ఈ నెల 21 నుంచి పిల్లలకు మంచి పోషక విలువలు ఉన్న రాగిజావ అందించడం మంచి నిర్ణయమన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : పీలేరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక ప్రసాద్ హాస్పిటలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో కంటి వైద్య శిబిరం నిర్వహించి వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే 20 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షులు సదాశివరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి మహేష్ గుప్తా, ట్రెజరర్ ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ ప్రసాద్, సభ్యులు సుధాకర్ రెడ్డి, సురేంద్రరెడ్డి, బాలాజి, సుబ్రమణ్యం, అరవిందో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మాచుపల్లె గంగమ్మ జాతర



సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో ఆదివారం ప్రజలు గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ బోర్డు డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిలు జాతరను పురస్కరించుకొని మాచుపల్లెలోని వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి గృహానికి వచ్చారు. తరువాత వారు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం వైఎస్ ఎంపీపీ ఏర్పాటు చేసిన విందులో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి మేడా మదుసూదన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి వల్లిచాన్, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, గోపాలస్వామి, నీలకంఠారెడ్డి, కె.వి. సుబ్బయ్య, క్రిష్ణచైతన్య, నాయకులు రాజారెడ్డి, వావిల్ల శ్రీనివాసులరెడ్డి, జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, మునిరెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎం. శ్రీనివాసులరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్ష బీభత్సం .. రైతులకు తీవ్ర నష్టం

- గుర్రంకొండలో వడగండ్ల వాన
- 120 ఎకరాల్లో దెబ్బతిన్న మామిడి
- 450 ఎకరాల్లో టామాట
- భారీగా దెబ్బతిన పూలతోటలు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



పెద్దమండ్యం : నేల కూలిన విద్యుత్ స్తంభం



గుర్రంకొండ : అరిగెలవారిపల్లెలో నీట మునిగిన టమాటా పంట

గుర్రంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన భారీ వడగండ్ల వానతో పంటలు, మామిడి, పూల తోటలు దెబ్బతిన్నాయి. గుర్రంకొండ, సరిమడుగు, మర్రిమాకులపల్లె, అమిలేపల్లె, శెట్టివారిపల్లె, తరిగొండ, రామాపురం, మర్రిపాడు, టి.రాచపల్లె గ్రామాల్లో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వడగండ్లు పడ్డాయి. దీంతో టామాటా, కర్బూజా తోటలు భారీగా దెబ్బతిన్నాయి. తోటల్లో ఎక్కడపడితే అక్కడ కాయలు నెర్రెలు చీలి కాలువల్లో పడిపోయాయి. తోటలు మొత్తం నేలకొరిగాయి. తోటలు మంచి అదనుమీద ఉండడంతో చేతికొచ్చిన పంట నేలపాలవడంతో రైతులు భారీగా నష్టపోయారు. మామిడితోటల్లో ఇప్పుడిప్పుడే మామిడికాయలు కాస్తున్న వేళ కాయలు మొత్తం తోటల్లో రాలిపోయి కిందపడిపోయాయి. పలుచోట్ల మామిడితోటలు పూతతోపాటు చెట్లు దెబ్బతిన్నాయి. తలారివాండ్లపల్లె వద్ద పలు రకాల పూలతోటలు దెబ్బతిన్నాయి. చామంతి. బంతితోపాటు పూల తోటలన్నినేలకొరిగాయి. పూలమొక్కలు తోటల్లో నేలపైన వాలిపోయాయి. మండలం మొత్తంమీద 120 ఎకరాల్లో మామిడితోటలు దెబ్బతిన్నాయి. 450 ఎకరాల్లో టమాటా, 25 ఎకరాల్లో పూల తోటలు, 15 ఎకరాల్లొ కర్బూజా తోటలు దెబ్బతిన్నాయి. గ్రామాల్లో అధికారులు పర్యటించి పంట నష్టం వివరాలు సేకరిస్తున్నారు.

పండ్ల తోటలు నేలమట్టం

కలకడ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి పండ్ల తోటలు పూర్తిగా నేలమట్టమయ్యాయి. అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలు, తోటలను ఆదివారం వ్యవసాయ శాఖాధికారులు పరిశీలించారు. కోన, నడిమిచెర్ల, దేవులపల్లె, రాతిగుంటపల్లె, ఎర్రకోటపల్లె, కె.బాటవారిపల్లె, బాలయ్యగారిపల్లె పంచాయతీలలోనే వంద ఎకరాల్లో టమాట, బొప్పాయి, వంగ తోటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాటిన మొక్కలు సైతం నీటిలో మునిగిపోయాయి. రూ.లక్షలు ఖర్చుచేసి సాగుచేసిన పంటలు వర్షార్పనం కావడంతో ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. దేవులపల్లె గోవర్ధన్ అనే రైతుకు సంబంధించిన అర ఎకరాల బొప్పాయి, మూడు ఎకరాల్లో టామట, కోన గ్రామానికి చెందిన అన్నయ్య సాగు చేసిన నాలుగు ఎకరాల బొప్పాయి, రెండు ఎకరాల టామట పంట దెబ్బతిన్నట్లు తెలిపారు.

దోస, టమాటా పంటలకు ..

తంబళ్లపల్లె: మండలంలో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి దోస, టమాటా పంటలు దెబ్బతిని నష్టం వాటిల్లింది. రెడ్డికోట పంచాయతీ మేకలవాండ్లపల్లెకు చెందిన బాలిరెడ్డి రూ.1.50 లక్షలతో ఖర్చుచేసి 2 ఎకరాలలో దోసపంట సాగు చేశారు. నెలరోజుల పంట వడగళ్లవానకు కురిసిన వర్షపునీటితో దెబ్బతింది. అదేగ్రామంలోని పలువురి రైతులకు చెందిన సుమారు 15 ఎకరాలలో టమాటా పంట దెబ్బతిని నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

అకాల వర్షానికి భారీ నష్టం

పెద్దమండ్యం: అకాల వర్షానికి పెద్దమండ్యం మండలంలో పంటలు, ఆస్తినష్టం భారీగా చోటుచేసుకుంది. మండలంలోని పాపేపల్లి, పెద్దమండ్యం, సీ.గొల్లపల్లి, బండ్రేవు గ్రామాల్లో శనివారం రాత్రి గాలి, వాన భీభత్సవం సృష్టించింది. 30 విద్యుత్ స్తంభాలు, మూడు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌కో అధికారులు ఆదివారం రాత్రి విద్యుత్‌ను పునరుద్ధరించారు. అలాగే టమటా, ఇతర పంటలు దెబ్బతిన్నాయి.









పెద్దమండ్యంలో నేలకూలిన భారీ చెట్టు, కలకడ: దేవులపల్లెలో దెబ్బతిన్న బొప్పాయి తోట, కలకడ: నీటి మునిగిన పంటను పరిశీలిస్తున్న అధికారి, వెంగన్నగారిపల్లెలో దెబ్బతిన్న టమాట తోట

ఓటర్‌కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్

వాల్మీకిపురం: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటర్ కార్డుకు ఆధార్ కార్డును అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్ అన్నారు. ఆదివారం మండలంలోని 16 పంచాయతీల్లో వీఆర్‌వోలతో కలసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీలోపు ఓట హక్కు కలిగిన లబ్ధిదారులు తప్పనిసరిగా ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో సుధాకర్, సంజీవ్, రెడ్డెప్ప, విఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి కృషి



మాట్లాడుతున్న గౌస్‌మోహిద్దీన్

గుర్రంకొండ: విశ్రాంత ఉద్యోగులకు భవనం సౌకర్యం కల్పించేందకు కృషి చేస్తామని జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి గౌస్‌మోహిద్దీన్ అన్నారు. ఆదివారం స్థానిక ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు సమావేశాలు నిర్వహించుకొనేందుకు వీలుగా స్థలసేకరణ చేసి భవన నిర్మాణం చేసేందుకు అందరూ సహకరించాలన్నారు. పాన్‌కు ఆధార్ కార్డును అనుసంధానం చేసుకోవాలన్నారు. సంఘం తరపున సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. సమావేశంలో మండలశాఖ అధ్యక్షులు యూసూఫ్, విశ్రాంత ఉద్యోగులు రెడ్డెప్ప , మహబూబ్‌ఆలీఖాన్, పి. రెడ్డెప్ప,పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నూతన కార్యవర్గం ఎన్నిక

గుర్రంకొండ: మండలం ఎబీవీపీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం గుర్రంకొండలో ఏబీవీపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సాయిహితేష్ అధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. మండల శాఖ కన్వీనర్‌గా పరసా అమరనాథ్, ఉపాధ్యక్షుడిగా వేణుమాధవ్, కార్యదర్శిగా విజయ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సీగే వంశీ, సోషియల్ మీడియా కన్వీనర్‌గా రెడ్డిప్రసాద్, పట్టణ కార్యదర్శిగా పార్థివ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలియజేశారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే ట్రాఫిక్ సమస్య

మదనపల్లె అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో చర్చ



చర్చావేదికలో మాట్లాడుతున్న మదనపల్లె అభివృద్ధి వేదిక అధ్యక్షులు హరిశర్మ

మదనపల్లె : పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాకపోవడానికి పాలకుల నిర్లక్ష్యమే కారణమని పలువురు విమర్శించారు. ఆదివారం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో మదనపల్లె అభివృద్ధి వేదిక నాయకులు హరిశర్మ అధ్యక్షతన ట్రాఫిక్‌సమస్య-పరిష్కార మార్గాలు అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో అపెక్స్ అసోసియేషన్ అధ్యక్షులు తిరుపతిరావు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి.టి.నరసింహులు, టీచర్ పురం వెంకటరమణ, రిటైర్డ్ ఉపాధ్యాయసంఘం నాయకులు ఉత్తన్న, నవజీవన్ అసోసియేషన్ నాయకులు కృష్ణమూర్తి, రచయితల సంఘం నాయకులు కృష్ణమూర్తి, జన విజ్ఞానవేదిక నాయకులు బాషా, ఎం.వి.చలపతి తదితరులు ప్రసంగించారు. పట్టణం అడుగడుగునా నిరాదరణకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 100 అడుగుల రోడ్డు ఆక్రమణలకు గురై 40 అడుగులకు కుంచించుకుపోయిందన్నారు. పట్టణంలోని రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించి, మురుగుకాలువలు నిర్మించాలని, వాటిపై ఫుట్‌పాత్ ఏర్పాటుచేయాలన్నారు. సీటీఎం రోడ్డులో చింతచెట్ల మధ్యలో పార్కింగ్ ఏర్పాటుచేసి వన్‌వే పకడ్బందీగా అమలు చేయాలని, బిజినెస్ ఏరియాలో పార్కింగ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. భారీవాహనాలను పట్టణంలోకి రానివ్వకుండా, మార్కెట్‌యార్డును బయటకు తరలించాలని, ప్రస్తుతం ఉన్న మార్కెట్ యార్డులోకి వారపుసంతను, వారపుసంతలోకి దినసరి, చేపల మార్కెట్ ఏర్పాటుచేయాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం అయ్యేవరకు అన్ని సంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకుని ఉద్యమం చేయాలని నిర్ణయించారు.

తరుణ్‌కు ఆర్థిక సహాయం



తరుణ్ తల్లికి నగదును అందజేస్తున్న ఎస్‌ఐ చంద్రమోహన్

మదనపల్లె సిటీ: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా ఎమర్జెన్సీ డోర్ తెరుచుకుని తీవ్రంగా గాయపడిన చిన్నారి తరుణ్‌కు హెల్పింగ్‌మైండ్స్ సంస్థ ఆర్థిక సహాయం చేశారు. ఆదివారం స్థానిక హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయంలో టు టౌన్ ఎస్‌ఐ చంద్రమోహన్ చేతుల మీదుగా రూ.60 వేలు తరుణ్ తల్లిదండ్రులు సుబ్రమణ్యం, కాంతమ్మలకు అందజేశారు. సాక్షిలో వచ్చిన వార్తను చూసి స్పందించినట్లు హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్ తెలిపారు. ప్రాణపాయస్థితిలో ఉన్న తరుణ్ పరిస్థితి చూసి చలించిపోయినట్లు తెలిపారు. ఇలాగే దాతలు ముందుకు రావాలని కోరారు. ఆపదలో ఉన్న ఆ కుటుంబానికి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు దినకర గౌస్, గౌతమ్, కిరణ్, బహుజన రాష్ట్ర నాయకులు ఆనంద్, శ్రీచందు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ఉత్సవాలకు ఏర్పాట్లు



చౌడేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

కలకడ : మండల కేంద్రంలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలను నిర్వహించడానికి అందరు తొగటవీరక్షత్రియులు కలిసి రావాలని ఆలయ శెట్టి, చలపతి జయరాం, సుధాకరలు కోరారు. ఆదివారం స్థానిక శ్రీచౌడేశ్వరిదేవి ఆలయం ఆవరణలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ ఏర్పాట్లను తెలియజేశారు. ప్రతి ఏడాది నిర్వహించే జ్యోతి ఉత్సవాలు ఈ ఏడాది కోన, గుడిబండ, కె.బాటవారిపల్లె గ్రామ ఉత్సవాల అనంతరం నిర్వహించాలని నిర్ణయించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ఆలయ నిర్మాణ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తొగటవీరక్షత్రియ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రత్నమయ్య, రవిప్రకాష్(న్యాయవాది), చిట్టి, జీపుల క్రిష్ణ, రెడ్డెప్ప, ప్రసాద్, రాజేంద్ర, బాబు, రామ్మోహన్, లక్ష్మి ఈశ్వర్, రామక్రిష్ణ, గురుస్వామి పాల్గొన్నారు.

ఘనంగా గంగజాతర ప్రారంభం



బోనాలు ఊరేగింపుగా తెస్తున్న చింతమాకులపల్లె నాయినివారు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న గంగజాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. చింతమాకులపల్లెకు చెందిన నాయునివారి తొలిబోనంతో జాతర ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం చింతమాకులపల్లెకు చెందిన రాజశేఖర్ నాయుడు కుటుంబ సభ్యులు పట్టువస్త్రాలు, బోనాలు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. గర్నిమిట్ట కస్బాలో గంగజాతర ఏర్పాట్లను జెడ్పీటీసీ గజ్జెల శృతి, సర్పంచ్ రమణమ్మ పర్యవేక్షించారు. ఆదివారం సాయంత్రం నుంచి ఆసాదికథ ఏర్పాటు చేశారు. సోమవారం భక్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లింపు కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

యువత నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



జీ 20 సదస్సు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : విద్యార్థి దశ నుంచే యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని జిల్లా వైద్యారోగ్య ఎడ్యుకేషన్ ఆఫీసర్ గుణశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో వైఎస్సార్‌జిల్లా నెహ్రూ యువకేంద్రం, ప్రొద్దుటూరు సాధన ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నైబర్డ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీ 20 సదస్సుకు సంబంధించి ఒకే కుటుంబం ఒకటే భవిష్యత్తుఅనే నినాదం గురించి, వై20, యువత స్కిల్స్, లేబర్ వెల్ఫేర్, బేటి బచావో, బేటీ పడావో, ఉమెన్ అర్బన్ డెవలప్‌మెంట్, స్వచ్ఛభారత్ అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ బాబురెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాయల్ సుధాకర్, పి.వి.ఎస్. లక్ష్మీ, హరిత తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపు అంచున విద్యుత్ స్తంభం



వాల్మీకిపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఇటీవల కురిసిన గాలీ వాన భీభత్సానికి విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగింది. జాతీయ రహదారిపై విద్యుత్ స్తంభం ఉండడంతో పెనుప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు స్తంభం కూలిపడుతుందోనని భయాందోళన చెందుతున్నారు. జాతీయ రహదారి పక్కనే ప్రమాదం పొంది ఉందని అందరూ చర్చించుకుంటున్నారు. వెంటనే సంబంధిత అధికారులు చొరవ తీసుకొని విద్యుత్ స్తంభాన్ని తొలగించి నూతన స్తంభం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతా భిషేకాలు చేశారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు.

సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె, సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు ఆలయ మెట్లకు పూజలు నిర్వహిస్తూ మోకాళ్లపైనడిచి ఆలయానికి చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు. రాయలసీమ జిల్లాలతో పాటు కర్నాటకా, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు.